# నియోజకవర్గం అభివృద్ధికి కృషి

**కృతజ్ఞత సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 14: మహేశ్వరం నియోజకవర్గం ప్రజలు అభివృద్ధికి పట్టంకట్టారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో ఉన్న ఎస్‌వైఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆమె హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీల వాసులు సబితారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ప్రజల గొంతుగా ఉంటానన్నారు. ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. ప్రజలందరి దీవెనలు కేసీఆర్‌పైన ఉండాలన్నారు. కేసీఆర్ త్వరగా కోలుకొని ప్రజల మధ్యకు రావాలన్నారు. మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. విజయానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులకు, బీఆర్‌ఎస్, కాలనీల అసోసియేషన్ నాయకులకు, అభిమానులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కామేశ్ రెడ్డి, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మంత్రులకు శుభాకాంక్షలు



రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడరు ఏనుగు జంగారెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మదన్‌పాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. *– కందుకూరు, డిసెంబర్ 14*

## చెరువు ఎఫ్‌టీఎల్‌కు హద్దులు ఏర్పాటు



హత్తిగూడ చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేస్తున్న హయత్‌నగర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ శర్మ, సిబ్బంది

హయత్‌నగర్, డిసెంబర్ 14 : హయత్‌నగర్ మండల పరిధిలోని హత్తిగూడ చెరువుకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసినట్లు హయత్‌నగర్ తహసీల్దార్ బి.సునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల రెవెన్యూ అధికారులు, సర్వేయర్, ఇరిగేషన్ శాఖ డీఈ, ఏఈ, వర్క్‌ఇన్‌స్పెక్టర్, జీహెచ్‌ఎంసీ లేక్ విభాగం అధికారులు హత్తిగూడ చెరువును పరిశీలించి ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించారు. రెవెన్యూ అధికారులు జేసీబీ వాహనంతో చెరువు ఎఫ్‌టీఎల్‌కు గోతులను తవ్వి చర్యలు చేపట్టారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా కబ్జాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రత్యేక ఆకర్షణగా లూప్‌లు, సెకండ్ లెవల్ ఫ్లైఓవర్లు

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

ఎల్బీనగర్, డిసెంబర్ 14 : ఎల్బీనగర్ నియోజకవర్గం బైరామల్‌గూడ జంక్షన్‌లో నూతనంగా నిర్మిస్తున్న లూప్‌లు, సెకండ్ లెవల్ ఫ్లైఓవర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బైరామల్‌గూడ జంక్షన్‌లో ఎస్‌ఆర్‌డీపీ పనుల్లో భాగంగా జరుగుతున్న లూప్‌లు, సెకండ్ లెవల్ ఫ్లైఓవర్ పనులను అధికారులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలోని ప్రభుత్వంలో ఎస్‌ఆర్‌డీపీ పనుల్లోని 47 ప్రాజెక్ట్‌ల్లో 36 ప్రాజెక్ట్‌లు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. బైరామల్‌గూడ జంక్షన్‌లో లూప్‌ల నిర్మాణం ద్వారా ఎల్బీనగర్, చంపాపేట, సాగర్ రింగ్‌రోడ్డు మార్గాల వైపు వెళ్లేందుకు ఈ లూప్‌లు ఉపయోగపడుతాయన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు తరహాలో బైరామల్‌గూడ జంక్షన్‌లో లూప్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ సుడిగుండాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ వాహనదారులకు బహుళ ప్రయోజనాలతో రూ.135 కోట్ల వ్యయంతో లూప్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఈ లూప్‌ల పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, ఎస్‌ఈ రవీందర్‌రెడ్డి, ఈఈ రోహిణి, డీఈ కార్తిక్, ఏఈ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బైరామల్‌గూడ జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న లూప్‌లను పరిశీలిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, అధికారులు

## చిరు వ్యాపారులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

మన్సూరాబాద్, డిసెంబర్ 14: కొత్తపేట బీజేఆర్ భవన్ నుంచి అష్టలక్ష్మి దేవాలయం కమాన్ మార్గంలో ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులను గత వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ చైర్మన్ జోగు రాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు ఇబ్బడి ముబ్బడిగా చలాన్లు విధిస్తూ తోపుడు బండ్లను తొలగిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి చిరు వ్యాపారస్తుల సమస్యకు పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ చైర్మన్ జోగురాములుకు చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన జాగృతి ఫోరం అధ్యక్షురాలు ఉషారాణి, ఎండీ నవాజ్‌ఖాన్, ఎండీ యూసుఫ్, షేక్ అబ్దుల్‌వాజిద్, ఎండీ బాబుమియా, తులసీరామ్, ప్రదీప్, కృష్ణవేణి, శైలజ, సంతోషి, పూస నాగలక్ష్మి, శివాని, మల్లమ్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎల్బీనగర్ ఎస్సీ సెల్ చైర్మన్ జోగురాములు, చిరు వ్యాపారస్తులు

## విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

హయత్‌నగర్, డిసెంబర్ 14:విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. గురువారం రాష్ట్రంలో జరగబోయే అండర్-14, 17 రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఎంపికైన హయత్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులను స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. హయత్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో కూడా పాల్గొనేలా తమ ప్రతిభను చాటాలని సూచించారు. బీఆర్‌ఎస్ హయత్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గుడాల మల్లేశ్, పాఠశాల హెచ్‌ఎం ఇందిర, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## రోడ్డు పనులు పరిశీలన

బడంగ్‌పేట, డిసెంబర్ 14: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటాద్రీ కాలనీలో సీసీ రోడ్డు పనులను బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి పరిశీలించారు. కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయించాలని ఆమె డీఈ జ్యోతికి సూచించారు. పనులు జరుగుతున్న క్రమంలో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను అధికారులు పరిశీలించాలని, పనులు సక్రమంగా చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, అధికారులు, కాలనీవాసులు ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

కందుకూరు. డిసెంబర్ 14 : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఫార్మాసిటీకి కేటాయించిన భూముల్లో మెగా సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై ర్యాలీ నిర్వహించి టపాకాయలు కల్చి ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడరు ఏనుగు జంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సభావత్ కృష్ణానాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్, వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, అందుగుల సత్యనారాయణ, సొడపు వెంకటేశ్ గౌడ్, మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అఫ్జల్ బేగ్, దంతోజు నర్సింహచారి, తల్లోజు వినోద్, చారి, గుండ్ర సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్, సిద్దు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## యూజీడీ సమస్య పరిష్కరిస్తా

మన్సూరాబాద్, డిసెంబర్ 14 : కాలనీల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరింపజేసి ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి శ్రీనివాసకాలనీలో గురువారం జలమండలి అధికారులతో కలిసి ఆమె పర్యటించి అక్కడి సమస్యలను పరిశీలించారు. యూజీడీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్, జలమండలి అధికారులకు కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. జలమండలి మేనేజర్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ చింతల అరుణకు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీనివాస కాలనీవాసులు

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మహేశ్వరం, డిసెంబర్ 14: ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం గ్రామ సర్పంచ్ కరోళ్ల ప్రియాంక రాజేశ్ అన్నారు. ఈనెల 16న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో అవిర సంతాన సాఫల్య కేంద్రం హాస్పిటల్ వారిచే ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.మహేశ్వరం గ్రామంతో పాటు ఇతర గ్రామాల మహిళలు ఈ శిబిరంలో పాల్గొని తగు సూచనలు, సలహాలను తీసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి జయప్రదం చేయాలని ఆమె కోరారు.

## కుమారుడితో సహా భార్యాభర్త అదృశ్యం



కందుకూరు. డిసెంబర్ 14 : ముగ్గురు అదృశ్యమైన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నేదునూరు గ్రామానికి చెందిన సాటు భారతమ్మ కుమారుడు బాబయ్య భార్య మమతతో గొడవ పడ్డాడు. దీంతో భార్య మమత తన కుమారుడు సాకేత్‌ను తీసుకొని ఇంట్లో నుంచి అలిగి వెళ్లి పోయింది. అయితే బాబయ్య భార్య, కుమారుడిని వెతకడానికి వెళ్లి కనిపించడంలేదు. తల్లి భారతమ్మ తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో బాబయ్య తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై సైదులు భార్యాభర్తతోపాటు కుమారుడు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.